సాక్షి ప్రకాశం

మంగళవారం। 11। జూన్। 2024



కనిగిరిలో ట్రాఫిక్.. వన్‌వేలతో చెక్

కనిగిరి మున్సిపాలిటీలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్‌పెట్టేలా వన్‌వేలు ఏర్పాటు చేస్తున్నారు. - 8లో..



స్కానింగ్ కేంద్రాలు నిబంధనల మేరకు నిర్వహించాలి

స్కానింగ్ కేంద్రాలు నిబంధనల మేరకు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33.6/27.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పీడీసీసీబీ చైర్మన్‌కు బన్నీ రాజీనామా

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌కు వై. మారుతీ ప్రసాదరెడ్డి (బన్నీ) రాజీనామా చేసినట్లు సోమవారం ఆయన లేఖ విడుదల చేశారు. ఈలేఖను రాష్ట్ర సహకార కమీషనర్‌కు పంపించారు. తక్షణమే తన రాజీనామాను అమోదించాలని ఆయన కోరారు.

జిల్లాలో పలు చోట్ల వర్షాలు

- 151.2 మిల్లీమీటర్ల మేర నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో 38 మండలాలకుగాను 24 మండలాల్లో 151.2 మి.మీల మేర ఆదివారం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో రాచర్ల 16.2 మి.మీ, దోర్నాల 11.8, యర్రగొండపాలెం, కొమరోలు, బేస్తవారిపేటల్లో 9.2 మిల్లీమీటర్ల చొప్పున, ఎస్ కొండ 7.8 మి.మీ, ఎన్‌జీపాడు, కొనకనమిట్లలో 7 మి.మీల చొప్పున, అర్ధవీడు 6.8, ఒంగోలు, ఒంగోలు అర్బన్, కొత్తపట్నంలలో 6.4 మి.మీ చొప్పున, పొన్నలూరు 6.2 మి.మీలు, గిద్దలూరు 5.8, పెద్దారవీడు 5.6, టంగుటూరు 5.2, హెచ్‌ఎం పాడు 4.4, కంభం 3.2, త్రిపురాంతకం 2.8, కనిగిరి 2, మద్దిపాడు, మార్కాపురం, తర్లుపాడులలో 1.8 చొప్పున మొత్తం 151.2, జిల్లా సరాసరి 3.9 మిల్లీమీటర్ల మేర నమోదైనట్లు చెప్పారు.

విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన 225 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. ఆస్తులతో సహా ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులు వీరన్నపాలెం ప్రాథమిక పాఠశాల-4, ఉన్నత పాఠశాల-13, పోలూరు ఉన్నత పాఠశాల-5, జాండ్రపేట ఉన్నత పాఠశాల-24, టంగుటూరు ఆర్‌వీ పాలెం-2, ఒంగోలు వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాల-3, చేజర్ల-2, చేజర్ల ఎస్‌సీ కాలనీ-2, బ్రాహ్మణ నిడమానూరు-2 ఉన్నారన్నారు. ఇక ఆస్తులతో సంబంధం లేకుండా కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ప్రభుత్వంలో విలీనమైన వారి వివరాలు పరిశీలిస్తే 168 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వంలో విలీనమయ్యారన్నారు. వీరికి జీవో నంబర్ 50 ప్రకారం ఉన్నత పాఠశాలలో పదోన్నతి సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రేపు పీఎం శ్రీ పథకానికి ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు: పీఎం శ్రీ పథకం ఫేజ్ 1, ఫేజ్ 2 కింద ఎంపికైన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులకు ఈనెల 12న ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర సమగ్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్, నేషనల్ ప్రొఫెషనల్ స్టాండర్డ్స్ ఫర్ టీచర్స్ వంటి అంశాలపై, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, విద్యా సంబంధమైన అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశాలన్నారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని పీఎం శ్రీ ఫేజ్ 1, ఫేజ్ 2 కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వారి ఉపాధ్యాయలందరికీ ఈ సమాచారం తెలియజేయాలని, యూట్యూబ్ లింక్ ద్వారా ఉపాధ్యాయులంతా వీక్షించాలన్నారు. అదే విధంగా ఎంఈవోలు, ఉప విద్యాశాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని డీఈవో డి.సుభద్ర ఆదేశించారు.

రైల్వే డబ్లింగ్ పనుల పరిశీలన

గిద్దలూరు రూరల్: గుంటూరు-గుంతకల్ మధ్యలో రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా మండలంలోని దిగువమెట్ట అభయారణ్య ప్రాంతంలో టన్నల్ సొరంగం ఏర్పాటు కోసం స్థానిక తహశీల్దార్ సిద్దార్థ్, దిగువమెట్ట ఫారెస్ట్ డిప్యూటీ రేంజి ఆఫీసర్ వంశీక్రిష్ణలతో కలిసి రైల్వేశాఖ అధికారులు సోమవారం నల్లమల అటవీ ప్రాంతంలో పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే టన్నెల్ సొరంగానికి అడవిలో భూమి ఎంతమేర కావాల్సి ఉంటుందనే అంశాలపై రైల్వేశాఖ అధికారులు పరిశీలించారు. గుంటూరు నుంచి గిద్దలూరు వరకు, గుంతకల్ నుంచి నంద్యాల వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. మధ్యలో నల్లమల అటవీ ప్రాంతంలోని డబ్లింగ్ పనుల కోసం టన్నెల్ సొరంగం ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు సరిపడా స్థల పరిశీలన కోసం రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.



నల్లమల అటవీప్రాంతంలో పరిశీలిస్తున్న అధికారులు

మన నువ్వులు..భళా..!



శివరామపురంలో సాగు చేసిన నువ్వుల పంట

నువ్వుల సాగు జిల్లా రైతులకు వరంగా మారింది. ఒక వైపు కాసుల వర్షాన్ని కురిపిస్తూనే మరో వైపు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో రైతులు ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఐఎన్‌డీఏపీ) ఇండి గ్యాప్ సర్టిఫికెట్ పొంది అంతర్జాతీయ స్థాయిలో 140 దేశాల్లో విక్రయించేందుకు అర్హత సాధించారు.

- జిల్లాలో సాగుచేసిన నువ్వులకు అంతర్జాతీయ గుర్తింపు
- ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ఉత్తమ ఫలితాలు
- జిల్లా వ్యాప్తంగా 403.9 ఎకరాల్లో సాగు
- తాళ్లూరు మండలం శివరామపురంలో 15 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం
- జిల్లా నువ్వుల పంటకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఇండి గ్యాప్) సర్టిఫికెట్, స్కోప్ సర్టిఫికెట్ మంజూరు
- ఎకరానికి రూ.40 నుంచి రూ.50 వేల వరకు ఆదాయం

ఒంగోలు సెంట్రల్: స్వల్ప వ్యవధి..తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించే పంటల్లో నువ్వులు సాగు ఒకటి. ఈ పంట ఎదుగుదలకు ఉష్ణోగ్రతలు కీలకం. ప్రధానంగా 25 నుంచి 37 డిగ్రీల మధ్య ఉంటే పంట ఎదుగుదల బాగా ఉంటుంది. విత్తనం విత్తిన తర్వాత 35 నుంచి 70 రోజుల మధ్య ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. ఈ పంట సాగుచేసే రైతులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2023-24 రబీలో 403.9 ఎకరాల నువ్వుల పంట సాగైంది. ఈ పంట పండిస్తున్న రైతులు పెట్టుబడికి మించి ఆదాయం వచ్చేందుకు అవసరమైన సలహాలు, సూచనలు వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చారు. ప్రధానంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తే కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. అధికారుల సలహాలు పాటించిన రైతులు నేడు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అందుకు నిదర్శనంగా నిలుస్తున్నారు తాళ్లూరు మండలానికి చెందిన రైతులు. వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లూరు మండలం శివరామపురం గ్రామానికి చెందిన నారిపెద్ది వెంకటేశ్వర్లు, మన్నం వేణు, నిశంకం వెంకటేశ్వర్లు, వేమిరెడ్డి రవీంద్రారెడ్డి, ముప్పవరపు వెంకటేశ్వర్లు, నల్లపాటి వెంకటేశ్వర్లు, వెన్నపూస వెంకటేశ్వర రెడ్డి, పెద అంజి రెడ్డి, నారి పెద్ది వెంకట శివ గణేష్, వెన్నపూస కోటి రెడ్డి, వద్దినేని శ్రీనివాసరావు, ముప్పరాజు రామాంజి, వెన్నపూస క్రిష్టా రెడ్డి, వేమిరెడ్డి క్రిష్టా రెడ్డి, వద్దినేని సుబ్బారావు తదితరులు 15 ఎకరాల విస్తీర్ణంలో నువ్వుల సాగును ప్రకృతి వ్యవసాయ విధానంలో చేపట్టారు. సేంద్రియ ఎరువులు, కషాయం వంటి పురుగు మందులు వాడటం ద్వారా ఆరోగ్యకరమైన నువ్వులు పండించగలిగారు. అందుకు సంబంధించిన రికార్డులను తాళ్లూరు వ్యవసాయాధికారి ప్రసాదరావు, వీఏఏ రాజశేఖర్ రెడ్డిల సహకారంతో నమోదు చేయించారు. వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పలు మార్లు రైతులతో సమావేశమై ఆరోగ్యకరమైన పంట పండించటానికి సూచనలు చేశారు.



రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు

ఎకరానికి రూ.35 వేలు ఆదాయం:

ఎకరా పొలంలో నువ్వు పంట పండించేందుకు సాగు ఖర్చు రూ.8 వేల వరకు ఉంటుంది. ఎకరానికి సరాసరి నాలుగు క్వింటాళ్ల చొప్పున నువ్వులు దిగుబడి వస్తే ప్రస్తుతం క్వింటా రూ.12 వేల వరకు ఉంది. వీటి ద్వారా రైతుకు రూ.48 వేలు ఆదాయం వస్తుంది. అన్ని ఖర్చులు పోను రూ.35 వేలు వరకు మిగిలే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో కూడా అమ్ముకునేందుకు వీలున్నందుకు మరో వెయ్యి వరకు డిమాండ్ పలికే అవకాశం ఉంది.



కోత విధానం గురించి వివరిస్తున్న ఏవో ప్రసాదరావు



నూగు గూడులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



రక్షణ చర్యలను వివరిస్తున్న వీఏఏ రాజశేఖర్ రెడ్డి

అంతర్జాతీయ గుర్తింపు ఇలా....

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన నువ్వుల పంట సేకరించిన వ్యవసాయశాఖ జిల్లా జేడీఏ శ్రీనివాసరావు బెంగళూరులోని యురేకా ఎనలిటికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెట్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించారు. మేలైన సాగు పద్ధతులతో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఐఎన్‌డీఏపీ) ఇండి గ్యాప్ సర్టిఫికెట్ వచ్చింది. దీంతో గ్లోబల్ మార్కెటింగ్ చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ధ్రువీకరణ సంస్థ (ఏపీఎస్ఓపీసీఏ) ఆమోదించి స్కోప్ సర్టిఫికెట్ ఇచ్చారు. దీని ద్వారా 140 దేశాల్లో నువ్వుల పంట విక్రయించుకునే అవకాశం లభించింది.

తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం



తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం, పేరు వచ్చింది. కేవలం ఎకరానికి దున్ని, విత్తనాలు చల్లి ఒకసారి వేప కషాయం మాత్రమే మందు చల్లాం. సేంద్రియ ఎరువులు వేశాం. ఎకరానికి రూ.8 వేలు ఖర్చు కాగా, మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వ్యవసాయశాఖ అధికారులు నిత్యం గమనిస్తూ పలు సూచనలు చేశారు.

– ఎస్ వెంకటేశ్వర్లు, రైతు, శివరామపురం.

నిరంతర పర్యవేక్షణతో రైతులు సాధించారు



రైతులకు చెందిన పొలాల్లో మట్టి, నీటి పరీక్షలు నిర్వహించి, పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాం. అంతర్గత ఆడిట్, వ్యవసాయ క్షేత్ర తనిఖీలు చేపట్టడంతో మంచి ఫలితాలు ఇచ్చారు. స్థానిక వీఏఏ రాజశేఖర్ రెడ్డి సహకారంతో రైతులకు చెప్పిన సలహాలు పాటించేలా చేసి తగిన ఫలితం సాధించాం.

– బి.ప్రసాదరావు, ఏవో, తాళ్లూరు

మంచి అగ్రికల్చర్ ఉత్పత్తులకు విలువ



సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారుల ఆదేశం మేరకు జిల్లాలో తాళ్లూరు మండలాన్ని ఎంపిక చేశాం. స్థానిక వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం సుభాషిణితో పాటు పాల్గొని రైతులకు సూచనలు చేశాం. చక్కగా పాటించారు. బెంగళూరుకి పరీక్షలకు పంపాం. పలు పరీక్షల అనంతరం స్కోప్ సర్టిఫికెట్ వచ్చింది. రైతులు ఉత్పత్తి చేసిన వాటికి వాల్యూ మరింత పెరగటంతో కష్టానికి తగ్గ ఫలితం వచ్చింది.

– ఎస్ శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

మృత్యు పాశాలు



ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు అన్నదమ్ములు



సాయిక్రిష్ణ



లోహిత్‌క్రిష్ణ



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు

- విద్యుత్ షాక్‌తో అన్నదమ్ములు మృతి

గిద్దలూరు రూరల్: విద్యుత్‌షాక్‌కు గురై అన్నదమ్ములు ఇద్దరు మృతి చెందిన సంఘటన గిద్దలూరు పట్టణంలోని ఒంగోలు రోడ్డులో హెచ్.పి పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన శీలం లోహిత్‌క్రిష్ణ (18), సాయిక్రిష్ణ (16) ఇద్దరు అన్నదమ్ములు టాటా ఏస్ వాహనంలో సప్లయర్స్ సామాన్లు తీసుకెళ్తూ విద్యుత్ తీగ ఆటోకు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ముండ్లపాడు గ్రామంలో సప్లయర్స్ నిర్వాహకుడు మృతుల తండ్రి శీలం గోపికృష్ణ గిద్దలూరు పట్టణంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఓ నూతన గృహ ప్రవేశం కార్యక్రమానికి ఈ నెల 9వ తేదీన సప్లయర్స్ సామాను ఏర్పాటు చేశాడు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ పూర్తయిన తరువాత తన ఇద్దరు కుమారులు సప్లర్స్ సామాన్లు ఆటోలో తీసుకొచ్చేందుకు వెళ్లారు. నూతనంగా గృహ ప్రవేశం ఏర్పాటు చేసిన ఇంటి నుంచి కొంత దూరంలో మరో నూతన గృహాన్ని నిర్మించేందుకు విద్యుత్ తీగను కర్రపై లాక్కున్నారు. ఆటోలో సామాన్లు తీసుకెళ్లే క్రమంలో ఆటో పై భాగాన ఉన్న ఇనుప రాడ్లకు ఆ విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై ఆటోలో నుంచి కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపేశారు. అనంతరం కిందపడిన లోహిత్‌క్రిష్ణ, సాయిక్రిష్ణలను ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ వై.వి.సోమయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. తండ్రి గోపిక్రిష్ణ ఫిర్యాదు మేరకు ఇంటి నిర్మాణం చేపడుతున్న ఇంటి యజమాని, విద్యుత్‌శాఖ అధికారుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గోపిక్రిష్ణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా అందులో ఇద్దరు కుమారులు ఒకేసారి మృత్యువాత పడటంతో ముండ్లపాడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తమ ఇద్దరు పిల్లల మరణానికి విద్యుత్‌శాఖ అధికారులే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం ఇంటి నిర్మాణం చేపట్టేవారు తమకు తెలియకుండానే విద్యుత్ తీగలను కర్రలపై లాక్కున్నారని చెబుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన దద్దాల

కనిగిరి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం కలిశారు. విజయవాడ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన దద్దాల నియోజకవర్గానికి సంబంధించిన పలు విషయాలు ఆయనతో చర్చించారు.



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో దద్దాల నారాయణ యాదవ్

15 నుంచి శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

- శ్రీగిరి ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడి

ఒంగోలు మెట్రో: మరో దివ్య తిరుమలగా పేరొందిన ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను జూన్ 15 నుంచి 19 వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు వెల్లడించారు. సోమవారం ఉదయం పది గంటలకు శ్రీగిరిలో బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీ స్వామి వారి ఆశీస్సులతో పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుగుతాయని పేర్కొన్నారు. 15 వ తేదీ శనివారం సాయంత్రం శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. విష్వక్సేన పూజ, మేదినీ పూజ, పుణ్యాహవచనం మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ జరుగుతాయి. బ్రహ్మాండ నాయకుడైన శ్రీగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఆలయ నిర్వాహకులు సూచించారు. శ్రీగిరి బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలయ అర్చకులు ప్రద్యుమ్న కుమార్, రంగస్వామి అయ్యంగార్, వేద పండితులు పొదిల భాను ప్రకాశ శర్మ, శనగవరపు రవితేజ తదితరులు పాల్గొన్నారు.



శ్రీగిరి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీగిరి దేవస్థానం పాలకవర్గం అర్చక స్వాములు

క్లుప్తంగా

ఇద్దరు మహిళలు అదృశ్యం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇరువురు మహిళలు కనిపించకుండాపోయిన సంఘటనలపై రెండు కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వివరాలు.. మార్కాపురం పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీలో ఉండే ఎనిబెర జోసెఫ్ కుమార్తె అరుణ కుమారి ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదని తండ్రి జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే పట్టణంలోని కంభం రోడ్డులో రజక వీధిలో నివాసముండే సురభి శ్రీనివాసులు తన భార్య నిర్మలా కుమారి నంద్యాల సమీపంలోని రైతు నగర్‌లో ఉన్న పుట్టింటికి పంపేందుకు ఈనెల 8వ తేదీన మార్కాపురంలో బస్సు ఎక్కించాడు. అయితే తన భార్య అటు పుట్టింటికి చేరలేదని, ఇటు తన ఇంటికి రాలేదని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు ప్లంబర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో ఓ ప్లంబర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మార్కాపురం మండలం తిప్పాయిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. మార్కాపురం పట్టణానికి చెందిన పెరుమాళ్ల నరసింహారావు తిప్పాయిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజీలో ప్లంబింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలు జారి పైనుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించి కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

కనిగిరిలో ట్రాఫిక్.. వన్ వేలతో చెక్!

- వన్ వే మార్గాలను వెల్లడించిన పోలీస్ శాఖ
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ప్రజలు సహకరించాలని సీఐ విజ్ఞప్తి


కనిగిరిలో ట్రాఫిక్ ఇలా..

కనిగిరి రూరల్: జిల్లాలో వేగంగా విస్తరిస్తున్న పట్టణాల్లో కనిగిరి ఒకటి. కనిగిరి నగర పంచాయతీగా అప్ గ్రేడ్ చెందిన 6 ఏళ్ల వ్యవధిలోనే గ్రేడ్–2 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం కనిగిరిలో 20 వార్డులు ఉన్నప్పటికీ గత ఐదేళ్లలో విపరీతంగా పట్టణ విస్తీర్ణం వ్యాప్తి చెందింది. పెరిగిన విస్తీర్ణానికి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టడానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రతి ఇంట్లో ద్విచక్ర వాహనాలు ఉండటం, కొందరికి రెండేసి వాహనాలు, భారీ సంఖ్యలోనే కార్లు ఉండటంతో పట్టణంలో వాహనాల రద్దీ పెరిగింది. బైపాస్ లేకపోవడంతో బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, మినీ ట్రావెల్స్, గ్రానైట్ లారీలు పట్టణంలోని ప్రధాన రోడ్ల నుంచి వెళ్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య పట్టణ ప్రజలను వేధిస్తోంది. చిన్న వాహనం రోడ్డుపై ఆగిందంటే కనీసం అరగంటకు పైగా వేచి ఉండాల్సిన పరిస్థితి. దానికి తోడు సరిపడా ట్రాఫిక్ సిబ్బంది లేరనే వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. పట్టణంలోని ప్రధాన రోడ్లపై వన్‌వే పద్ధతిని అమలు చేస్తోంది. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని సీఐ దాసరి వెంకటేశ్వరరావు, ఎస్సై త్యాగరాజు సోమవారం హెచ్చరికలు జారీ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ఇవే..

వాహనాల రద్దీ దృష్ట్యా పట్టణ ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ సమస్య నివారణకు పోలీసులు చేపట్టిన చర్యలు ఇలా ఉన్నాయి.

- ఓవీ రోడ్డు(కనిగిరి–కందుకూరు రోడ్డు) పై నుంచి ఎంఎస్ఆర్ రోడ్డుకు వెళ్లే వాహనాలు తీగలగొంది నుంచి వెళ్లాలి.
- ఎంఎస్ఆర్ రోడ్డు నుంచి ఓవీ రోడ్డుకు వెళ్లే వాహనాలు వైఎస్సార్ రోడ్డు పై నుంచి వెళ్లాలి.
- పామూరు బస్టాండ్ నుంచి చెప్పుల బజార్ మీదుగా పునుగోడు, గార్లపేట రోడ్డు వైపునకు వెళ్లాల్సిన భారీ వాహనాలు(లారీలు, ట్రాక్టర్లు, ట్రక్‌లు, ట్రిప్పర్, గ్రానైట్ లారీలు మొదలైనవి) ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిషేధించారు. ఆ వాహనాలు పునుగోడు వైపు వెళ్లేందుకు శంఖవరం రోడ్డును వినియోగించుకోవాలి.
- వాహనదారులు నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే రోడ్డుకు ఎడమ వైపు వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.


దాసరి వెంకటేశ్వరరావు (సీఐ, కనిగిరి)

- పట్టణంలోని వార్డులు 20
- ప్రస్తుత జనాభా 55,500(సుమారుగా)
- పట్టణ విస్తీర్ణం 24.5 చదరపు కిలోమీటర్లు

ఆదర్శ పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: మండలంలోని మిట్టమీదిపల్లిలో ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బీ వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 20వ తేదీన ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకూ ప్రవేశ పరీక్ష జరుగుతుందని సీట్ల కేటాయింపు ఖాళీ అయిన రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామని విద్యార్థులు, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వస్త్రదుకాణం వ్యాపారి అదృశ్యం

- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

దర్శి: దర్శికి చెందిన వస్త్ర దుకాణ వ్యాపారి మేడా హనుమంతరావు అదృశ్యమయ్యారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్శి ఎస్సై సుమన్ కేసు నమోదు చేశారు. ఈనెల 8వ తేదీన దుస్తుల కొనుగోలు కోసం గుంటూరు వెళ్లారని, అక్కడి నుంచి బెంగళూరు వెళ్తున్నట్లు చెప్పి ఇప్పటి వరకు ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ చేసి ఉండటంతో భార్య సుభాషిణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే బయట మాత్రం మరో విధంగా ప్రచారం నడుస్తోంది. హనుమంతరావుకు భారీ మొత్తంలో అప్పులు ఉన్నాయని, తనకు ఇవ్వాల్సిన వారు డబ్బు ఇవ్వకపోవడం, అప్పుల బాధలు తాళలేక ఇంటి నుంచి వెళ్లిపోయారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

స్కానింగ్ కేంద్రాలు నిబంధనల మేరకు నిర్వహించాలి

- లేనివాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్


పీసీ యాక్ట్ అమలుపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు ఉన్నాయా లేదా, అనుమతులుంటే నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అనే అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం ప్రకాశం భవనంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ యాక్ట ప్రకారం అనుమతులు, నిబంధనల అమలు ఎలా ఉందో తెలుసుకునేందుకు స్కానింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు పొందిన స్కానింగ్ కేంద్రాలు తిరిగి రెన్యువల్ చేసుకున్నారో లేదో కూడా పరిశీలించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల అనుమతులకు సంబంధించి సమావేశంలో 8 కొత్త దరఖాస్తులు, 8 రెన్యువల్ దరఖాస్తులను ఆమోదించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రావు, డీఎంహెచ్ఓ సురేష్, నాగార్జున, సార్డ్స్, ఎన్‌జీఓ సభ్యులు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలవన్మరణం

మార్టూరు: భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కప్పెర పెద్ద అంజయ్య కుమార్తె గిరీష(21)కు మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన విభూది అంకారావుతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఐదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. గిరీషను కొంత కాలం నుంచి భర్త అంకారావుతోపాటు అత్త మార్తమ్మ, బావ హనుమంతరావు తరచూ శారీరకంగా వేధిస్తుండగా బాధలు తాళలేక రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. గిరీషను బాగా చూసుకుంటానని నమ్మబలికిన అంకారావు ఇటీవల బొల్లాపల్లికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న భర్త అంకారావు, తన తల్లి మార్తమ్మ సోదరుడు హనుమంతరావుతో కలిసి గిరీషపై విచక్షణా రహితంగా దాడి చేశారు. వీరి వేధింపులు తట్టుకోలేని గిరీష ఇంట్లోని గదిలోకి వెళ్లి తాళం వేసుకొని చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఫ్యాన్‌కు వేలాడుతున్న గిరీషను గమనించిన భర్త అంకారావు స్థానికులతో కలిసి గది తాళం పగలగొట్టి కిందకు దించారు. కొన ఊపిరితో ఉన్న గిరీషను చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గిరీష తండ్రి పెద్ద అంజయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ల రాజీనామా


గోగినేని శారద


రాజీనామా చేస్తున్న షేక్ షకీలా అమీన్ బాషా

దర్శి/సింగరాయకొండ: దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ షేక్ షకీలా అమీన్ బాషా సోమవారం స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేశారు. ఈ ఏడాది చివరి వరకు పదవీ కాలం ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆమె రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఏఎంసీ సెక్రటరీ పద్మశేఖర్‌కు అందజేశారు.

- కొండపి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గోగినేని శారద సోమవారం స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు. తన రాజీనామా పత్రాన్ని మార్కెటింగ్ యార్డు సెక్రటరీ కె.మాధవరావు ద్వారా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు పంపినట్లు ఆమె ఓ ప్రకటనలో వివరించారు.

జీవో 117ను తక్షణమే రద్దుచేయాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల

ఒంగోలు: జీవో నంబర్ 117ను తక్షణమే రద్దుచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో బోధన రెండు మాధ్యమాల్లో జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు కలిగించేలా ఉండాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఐఆర్, పీఆర్సీ, 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ కమిటీ సభ్యులు ఎస్‌కె నాయబ్‌రసూల్, బి.శేషారావు, పి.హనుమంతరావు, ఎ.దేవీ ప్రసాద్, సీహెచ్ శివరామకృష్ణ, కె.తిరుమల, టి.సుబ్బారాయుడు, పి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.331


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

- ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు వెల్లడి

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. ఫిబ్రవరి 25న మొదలైన ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 77వ రోజు వేలం పాట జరుగుతున్నట్లు చెప్పారు. అందులో 5104 బేళ్లు రాగా, 4678 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు, 426 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. అందులో కేజీ గరిష్టంగా రూ.331 కాగా, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.284.69 వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కనిగిరి, కందుకూరు–2, ఒంగోలు–2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 72వ రోజు వేలం పాటలు జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 4902 బేళ్లు రాగా, 4115 బేళ్లు కొనుగోలయ్యాయని, 787 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారన్నారు. అందులో గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.287.69 పడినట్లు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర రూ.330

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.330కు వ్యాపారులు కొనుగోలు చేశారు. దావగూడూరు, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 912 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 824 కొనుగోలు చేశారు. 88 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.257.24 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 39 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆకట్టుకున్న నాటికలు

చీరాలలో తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలు


ఇంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: కళాంజలి, చీరాల సాంస్కృతిక మిత్రమండలి ఆధ్వర్యంలో చీరాలలోని కేజీఎం గరల్స్ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి జాతీయ నాటకోత్సవాల్లో ప్రదర్శిస్తున్న నాటికలు ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. సోమవారం జరిగిన నాటిక పోటీలకు కీర్తిశేషులు బీరం వెంకట సుబ్బయ్య, పున్నమ్మ కళాప్రాంగణంగా ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో భాగంగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే «ఇంద్రప్రస్థం నాటకాన్ని ప్రదర్శించారు. నాటికకు గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ) రచించగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. కుటుంబ జీవనంలో నాన్న విలువ తెలిపే ఇంద్రప్రస్థం నాటకం ఆకట్టుకుంది. ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోతున్న యువతీయువకుల్ని సరిదిద్ది, జీవితం కంటే ప్రేమ ఏదీ కాదని తెలిపే సారాంశంతో నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం కళారూపాలు ప్రదర్శించే చోటుకే ప్రేక్షకులు వచ్చి తిలకించి సదాలోచనతో సమసమాజం వైపు అడుగులు వేయాలని ప్రబోధించే నాటిక «కమనీయం» నాటికను సద్గురు కళానిలయం గుంటూరు వారిచే ప్రదర్శించారు. కళాకారులు, ప్రేక్షకులు లేకపోతే కళారూపాలు కనుమరుగవుతాయని తెలిపే కమనీయం నాటిక అందరిని అలరించింది. మునిపల్లె విద్యాధర్ నాటికను రచించగా, బసవరాజు జయశంకర్ దర్శకత్వం వహించారు. ముందుగా నటరాజ పూజతో రెండు నాటికలను ప్రారంభించారు. ప్రదర్శన అనంతరం దర్శకులకు జ్ఞాపికలను అందించారు. నాటకోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, కోశాధికారి దరియా సాహెబ్, వీరభద్రాచారి, ఎం.లూక, భాగి కృష్ణమూర్తి, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాకల బీచ్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి


పాకల తీరంలో వెంకటేశ్వర్లు మృతదేహం

సింగరాయకొండ: పాకల బీచ్‌లో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణం వైశ్య బజారులో నివసిస్తున్న వడ్డీ వ్యాపారి కొత్తూరి వెంకటేశ్వర్లు(45) గత కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఇతనికి వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో పాకల బీచ్‌కు వచ్చిన వెంకటేశ్వర్లు బీచ్‌లోని దుకాణాల వద్ద తన బైక్ పార్కింగ్ చేసి జెట్టీ వైపు నడుచుకుంటూ వెళ్లాడు. రాత్రి ఏడు గంటల సమయంలో జెట్టీ సమీపంలో సముద్రపు ఒడ్డున అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని రామాయపట్నం మెరైన్ హోం గార్డు మస్తాన్‌కు అందించారు. అయితే మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఆ ప్రాంతంలో మద్యం సేవిస్తున్న మందుబాబులు మృతుడిని కందుకూరుకు చెందిన వడ్డీ వ్యాపారిగా గుర్తు పట్టారు. మృతుని ఫొటో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో విషయం తెలిసి మృతుని తండ్రి చిన మస్తానయ్య, స్నేహితులు ఇద్దరు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి మస్తానయ్య మాత్రం తన కుమారుడు వెంకటేశ్వర్లు ఫోన్ ఇంటి వద్ద ఉంచి వచ్చాడని స్థానికులకు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారుల విజయకేతనం


బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఏకేపీ కాలేజ యాజమాన్యం

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులలో ఏడుమంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి చీరాల ప్రతిష్టను ఇనుమండింపచేసినట్లు కోచ్ గూడూరి శాంతి వరప్రసాద్ తెలిపారు. ఈనెల 9న రేపల్లెలో రాష్ట్రస్థాయి నాలుగో సీనియర్, జూనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీరాల ఏకేపీ జూనియర్ కాలేజిలో హంటర్స్ తైక్వాండో కోచ్ గూడూరి శాంతి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో పాల్గొన్న ఎనిమిది మంది క్రీడాకారుల్లో ఏడుగురు 51 కేజీల విభాగంలో జి. రవికుమార్, 42 కేజీల విభాగంలో కె. రేష్మ, 48 కేజీల విభాగంలో ఓ. సువార్త, 63 కేజీల విభాగంలో జి. శివ బాలాజి, 45 కేజీల విభాగంలో బి. సిద్దిక్ ప్రణయ్, సీహెచ్. అభిరామ్, ఎ. యశ్వంత్, బంగారు పతకాలు సాధించగా ఎ. సుశాంత్‌కు రజత పతకం లభించింది. పతకాలు సాధించిన క్రీడాకారులకు కాలేజి యాజమాన్యం సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా కాలేజి ప్రిన్సిపల్ శైలజ వాణి క్రీడాకారులను కోచ్ శాంతి వరప్రసాద్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. కళాశాలలో హంటర్స్ తైక్వాండోకు వసతి కల్పించిన కాలేజీ యాజమాన్యానికి వరప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.